సాక్షి
గుంటూరు
మంగళవారం ǀ 15 ǀ ఏప్రిల్ ǀ 2025



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి గుడి పునర్నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన తోట రవికుమార్, సునీత దంపతులు రూ.1,01,116 విరాళంగా అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 515.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు నీటిని నిలుపుదల చేశారు.

ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మాచవరం గ్రామంలోని నల్లంత ఆంజనేయ స్వామి తిరునాళ్లను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

గంజాయి అమ్మకాలపై నిఘా ఉంచాలి



నెహ్రూనగర్: ప్రభుత్వం తలపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 28 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలియజేశారు. సోమవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టి పట్టణ, మున్సిపల్ ప్రాంతాల్లో అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ కూడా అనధికార మద్యం దుకాణాలు లేకుండా చూడాలన్నారు. ప్రతి మద్యం దుకాణం, బార్ అండ్ రెస్టారెంట్‌లలో, కల్లు దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి కల్తీ జరగకుండా చూడాలన్నారు. మద్యం దుకాణాల్లో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి మద్యం సీసాలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మితే కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు ఎం సుధాకర్‌రెడ్డి, ఎం రవికుమార్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె మణికంఠ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు ఇ మారయ్యబాబు, కె రవీంద్ర, జి సూర్యనారాయణ, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు హైకోర్టు కామన్ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన ఎస్జీటీ, భాషా పండిట్ ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను మంగళవారం ఉదయం 11 గంటలకు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో పొందుపర్చిన 10-10-2017 నాటి కామన్ సీనియారిటీ జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన



నరసరావుపేట: భారత రాజ్యాంగం కాపాడాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత, పేద మధ్యతరగతి ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లిం సంఘాలు, సీపీఎం, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లింల అణచివేతకు పాల్పడుతుందన్నారు. ఒక్క ముస్లింను కూడా కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గంలో నియమించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం నాయకులు డి.శివకుమారి, పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అమరావతి రజక ఐక్యవేదిక నాయకులు ఉదయగిరి వెంకటస్వామి, మైనారిటీ నాయకులు మాదిన రసూల్ రఫీ, వర్లమాబు, కరీముల్లా, ఖలీల్, మెకానిక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

ముగిసిన గోవర్ధనస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



నాదెండ్ల: నాదెండ్లలో కొలువై ఉన్న చారిత్రాత్మక ఆలయమైన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోవర్ధనస్వామి, భూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారి ధ్వజారోహణ నిర్వహించారు. ఈ నెల 8న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్లకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సాయిశ్రీనివాసాచార్యులు, విజయరామాచార్యులు, సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

పాలకుల పాపం

పోలీసు శాఖకు శాపం

- వర్గపోరుతో సతమతం
- బీసీ, ఎస్సీలంటే చిన్నచూపు
- బలహీనవర్గాలైతే సస్పెన్షన్
- అధికారపార్టీ సామాజికవర్గమైతే వీఆర్‌తో సరి!
- వివక్షపై మండిపడుతున్న పోలీసు సిబ్బంది
- బోరుగడ్డ అనిల్, గోరంట్ల మాధవ్ కేసుల్లో బలి చేసింది బలహీనవర్గాలనే



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పాలకుల పాపం పోలీసు శాఖకు శాపంగా మారుతోంది. రాజు గారి బిడ్డను ఎత్తుకున్నా తప్పే... దింపినా తప్పే అనే చందాన గుంటూరు రేంజ్ ఐజీ వ్యవహారం తయారైంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు తెలుగుదేశం పార్టీ సామాజికవర్గం వారైతే వీఆర్‌కు పిలవడం, తర్వాత పోస్టింగ్ ఇవ్వడం.. అదే బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలైతే సస్పెన్షన్‌కు గురి చేయడం రేంజ్‌లో చర్చనీయాంశంగా మారింది. రెండురోజుల క్రితం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసినప్పుడు తన లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడారన్న సాకుతో ఒక బీసీ వర్గానికి చెందిన సీఐతోపాటు బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే సమయంలో అక్కడే ఉన్న కూటమి సామాజికవర్గం సీఐపై చర్యలు తీసుకోకపోవడాన్ని సిబ్బంది ఎత్తిచూపుతున్నారు.

ఇటీవల పెరిగిన సస్పెన్షన్లు

చిన్నాచితక వ్యవహారాలకు కూడా ఎటువంటి సమాచారం లేకుండా, వివరణ తీసుకోకుండా సస్పెన్షన్ వేటు వేయడం ఇటీవల గుంటూరు రేంజ్ పరిధిలో ట్రెండ్‌గా మారిందనే వాదన వినిపిస్తోంది. ఇటీవల అరెస్టు చేసిన గోరంట్ల మాధవ్‌ను వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లిన సమయంలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, పట్టాభిపురం ఎస్సై రాంబాబు, నగరంపాలెం ఎస్సై ఆంజనేయులతోపాటు ఏఆర్ పోలీసులు, సిబ్బంది బందోబస్తుగా వెళ్లారు. అయితే వైద్య పరీక్షల సమయంలో లాయర్‌తో మాట్లాడేందుకు మాధవ్ తన అనుచరుల వద్ద ఫోన్ తీసుకుని మాట్లాడుతుండగా ఈ విషయాన్ని గుర్తించిన అరండల్‌పేట సీఐ వీరాస్వామి దానిని లాక్కున్నారు. అయితే ఫోన్ మాట్లాడే వరకు ఎందుకు ఊరుకున్నారనే సాకుతో ఈ వ్యవహారంలో ఎస్సీ, బీసీలు అయిన అరండల్‌పేట సీఐ వీరాస్వామితోపాటు ఎస్సై రాంబాబు, ఎస్సై ఆంజనేయులు, మరో తొమ్మిది మంది కిందిస్థాయి సిబ్బందిని సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే అక్కడే మౌనంగా ఉన్న కొత్తపేట సీఐ వీరయ్య చౌదరిపై మాత్రం ఏ చర్యలూ తీసుకోలేదు. దీనిపై పోలీసు శాఖలో విస్మయం వ్యక్తమవుతోంది. ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యనూ వీఆర్‌కు పంపడం చర్చకు దారితీసింది. సీతారామయ్య బాధ్యతలు తీసుకున్న దగ్గర నుంచి ఆయనను సాగనంపేందుకు అధికారపార్టీ సామాజికవర్గానికి చెందిన సీఐలు, ఎల్లో మీడియా చేయని యత్నాలు లేవని తెలుస్తోంది.

బీసీ ఎస్సీలే సమిధలు..!

పోలీసు శాఖలో బీసీలు, ఎస్సీలే సమిధలవుతున్నారు. గతంలోనూ బీసీ, ఎస్సీ పోలీసు అధికారులపై పోలీసు ఉన్నతాధికారులు వేటు వేశారు. నాలుగు నెలలక్రితం పశ్చిమ ఎమ్మెల్యే కోపంగా ఉన్నారంటూ ఎల్లో మీడియాలో వార్త రాగానే నగరంపాలెం సీఐ వీరానాయక్‌ను వీఆర్‌కు పిలిచారు. పట్టాభిపురం స్టేషన్‌కు పోస్టింగ్ వచ్చిన 24 గంటల్లోనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మధుసూదనరావును వీఆర్‌కు పిలిచి అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన గంగా వెంకటేశ్వర్లుకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే చిన్న విషయాన్ని సాకుగా చూపి డీసీఆర్‌బీ సీఐ బిలాలుద్దీన్‌ను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే రేంజ్ పరిధిలోని రాపూరు స్టేషన్ అధికారిపై ఆరోపణలు వచ్చినా అధికార పార్టీ సామాజిక వర్గం కావడంతో చర్యలు తీసుకోకుండా వీఆర్‌కు పిలిచి ఊరుకున్నారు. అధికారపార్టీ అనుకూలురు అయితే ఒకలా.. మరో వర్గం వారైతే మరోలా పోలీసుశాఖ ఉన్నతాధికారులు వ్యవహరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే..!

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసు శాఖ ఒక వర్గానికి కొమ్ముకాస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఐజీ కూడా అధికార పార్టీకి వంతపాడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరుకు చెందిన బోరుగడ్డ అనిల్‌కు పోలీసుస్టేషన్‌లో రాచమర్యాదలు చేశారన్న విషయంలోనూ బీసీ, ఎస్సీ, మైనారిటీ సిబ్బందిపైనే సస్పెన్షన్ వేటు వేశారు. అప్పట్లో అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన సీఐ కుంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచి కొద్ది కాలానికి కీలకమైన రాజధాని ప్రాంతానికి సీఐగా బదిలీ చేశారు. అదే సమయంలో సస్పెండ్ అయిన వారిపై సస్పెన్షన్ ఎత్తివేయలేదు. ఈ నేపథ్యంలో మనోవ్యథతో మైనారిటీ వర్గానికి చెందిన ఒక కానిస్టేబుల్ మృతి చెందారు.

ఆత్మస్తుతి.. పరనింద



సమావేశంలో నియోజకవర్గ సమస్యలు ఏకరువు పెడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

- సీఎం పర్యటన అట్టర్ ఫ్లాప్
- జనం లేక వెలవెలబోయిన సభ
- డ్వాక్రా మహిళలను బెదిరించి కూర్చోబెట్టిన టీడీపీ నేతలు
- స్థానిక సమస్యలు పట్టించుకోని చంద్రబాబు
- నియోజకవర్గ సమస్యలు ఏకరువు పెట్టినా స్పందించని వైనం
- స్థానికులు గరంగరం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సీఎం చంద్రబాబు పర్యటన పేలవంగా సాగింది. పీ-4 పథకంలో భాగంగా మార్గదర్శి-బంగారు కుటుంబం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అయింది. ఈ కార్యక్రమంలో ఆద్యంతం సీఎం చంద్రబాబు ఆత్మస్తుతి.. పరనిందకు ప్రాధాన్యం ఇచ్చారు. నియోజకవర్గ సమస్యల గురించి పన్నెత్తి మాట్లాడలేదు. ఫలితంగా ప్రజలు ఉసూరుమన్నారు. సభ సాక్షిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతోపాటు స్థానికంగా ప్రధాన సమస్యలు ఏకరువు పెట్టినా చంద్రబాబు చలించలేదు.

ఈ సమస్యలపై స్పందనేదీ?

2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్ల విస్తరణ పేరుతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తాడికొండ ప్రధాన రహదారి వెంట ఇళ్లు కూల్చివేతలు జరిగాయి. బాధితులు పరిహారం కోసం కాళ్లరిగేలా తిరిగినా ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీంతో తాడికొండ కొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయానికి, ఫిరంగిపురం కార్మెల్ మాత ఆలయానికి ఘాట్ రోడ్ల నిర్మాణంపై గత ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీలను సోమవారం సభ సాక్షిగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లినా సీఎం స్పందించలేదు. గ్రామాల్లో తాగునీటి సమస్య, లాం వద్ద కొండవీటి వాగుపై వంతెన నిర్మాణం కొండవీటి వాగు ఆధునికీకరణ, బండారుపల్లి మేజర్ పూడికతీత వంటి ప్రధాన సమస్యలనూ ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. అయినా సీఎం సానుకూలంగా స్పందించలేదు. దీంతో స్థానికులు, నియోజకవర్గ ప్రజలు సీఎం తీరుపై ధ్వజమెత్తుతున్నారు. ఇదిలా ఉంటే జనం లేక సభాస్థలి వెలవెలబోయింది. సభకు తీసుకొచ్చిన డ్వాక్రా మహిళలను టీడీపీ నేతలు బెదిరించి కూర్చోబెట్టారు. ఎండ వేడిమికి వారు అల్లాడారు. స్నాక్స్ అందక ఇబ్బందులు పడ్డారు.

హెలిప్యాడ్ వద్ద సీఎంకు స్వాగతం

అంతకుముందు హెలిప్యాడ్ వద్ద సీఎంకు నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి తదితరులు పాల్గొన్నారు.

వేదికపై ఎస్సీలకు చోటేదీ..!

ఇదిలా ఉంటే అంబేడ్కర్ జయంత్యుత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమ వేదికపై ఎస్సీ నేతలకు చోటు దక్కలేదు. కేవలం ఓ సామాజిక వర్గానికి చెందిన నాయకులే అక్కడ బారులు తీరడం కనిపించింది. కార్యక్రమంలో పొన్నెకల్లు సర్పంచ్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నూకతోటి మేరిమ్మ, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య మినహా మరే ఎస్సీ నేతా కనిపించలేదు. వీరు కూడా ప్రొటోకాల్‌లో భాగంగా అక్కడ ఉన్నారు. దీనిపై ఎస్సీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఈ వివక్ష ఏమిటని ప్రశ్నించారు.

మహనీయుడు అంబేడ్కర్



గుంటూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునేలా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ అణగారినవర్గాలను మరింత అణిచివేస్తున్న సమయంలో అంటరానితనం, పేదరికంపై పోరాడిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కీర్తించారు. ఎంతో కష్టపడి చదివి.. రాజ్యాంగాన్ని నిర్మించే స్థాయికి ఎదిగిన ఆయన అకుంఠిత దీక్ష ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. రాజ్యాంగం ద్వారా దళిత వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ కేంద్రంగా 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించి లైటింగ్‌ను ఆపేసి, వైఎస్ జగన్ పేరును కూడా తొలగించారని, దీనిపై ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి అంబేడ్కర్ అంటే ఏ మాత్రం గౌరవం లేదని ఆరోపించారు. ముందుగా గడ్డిపాడులోని అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి అంబటి నివాళులు అర్పించారు. అనంతరం లాడ్జిసెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయలు రాజనారాయణ, మెట్టు వెంకటప్పారెడ్డి, మండేపూడి పురుషోత్తం, మామిడి రాము, కొత్తా చిన్నపరెడ్డి, నందేటి రాజేష్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, కొలకలూరి కోటేశ్వరరావు, ఈమని రాఘవరెడ్డి, సైదాఖాన్, చదలవాడ వేణు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కడచూపునకు వస్తూ కడతేరే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- నానమ్మ మరణ వార్త విని వస్తుండగా దుర్ఘటన
- శోకసముద్రంలో మునిగిన కుటుంబం



శివరామకృష్ణ(ఫైల్)

యడ్లపాడు: నాయనమ్మ మరణించిందని తెలిసి కడచూపుకు వస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ హృదయ విదారక ఘటన యడ్లపాడు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట పోలిరెడ్డిపాలెం ఎదురుగా ఉన్న లక్ష్మీనర్సింహకాలనీకి చెందిన మక్కెన శ్రీనివాసరావు దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నవాడైన శివరామకృష్ణ(28)కి ఏడాదిన్నరక్రితం సమీప బంధువు నందినితో పెళ్లయింది. శివరామకృష్ణ విజయవాడలోనే ఉంటూ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం చిలకలూరిపేట రూరల్ మండలం అప్పాపురం గ్రామంలో ఉన్న నాయనమ్మ సుబ్బులమ్మ చనిపోయిందన్న వార్త తెలిసి చూసేందుకు బైక్‌పై బయలుదేరాడు. యడ్లపాడు గ్రామంలోని ఎన్‌ఎస్‌ఎల్ నూలుమిల్లు వద్ద ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు తప్పి ఆ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివరామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు శివరామకృష్ణను విజయవాడ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే సుబ్బులమ్మ భౌతికకాయాన్ని చూసేందుకు తరలివచ్చిన బంధుమిత్రులు సోమవారం ఉదయం ఆమెకు అప్పాపురంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివరామకృష్ణ భౌతికకాయానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. శివరామకృష్ణకు చిలకలూరిపేట పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సైబర్‌'తెగింపు'

వలలో పడ్డారో విలవిల..!!

- ఆన్‌లైన్‌లో వస్తువుల పేరుతో మోసం
- తెలియని లింకులు క్లిక్ చేస్తే చిక్కులే..
- డేటా కాజేసి.. దోచేసే అవకాశాలే అధికం..
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసు అధికారులు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలోని బ్రాడీపేటకు చెందిన శ్వేత అనే యువతి ఇన్‌స్టాగామ్ చూస్తుంటారు. ఈ క్రమంలో ఆమె ఒక యాడ్‌ను చూసి తక్కువ ధరకే పలు వస్తువులు వస్తున్నాయన్న నేపథ్యంలో రూ.700 చెల్లించి బుక్ చేశారు. నాలుగు రోజుల తరువాత కొరియర్ వచ్చింది. కొరియర్ కవర్ ఓపెన్ చేసిన ఆమె షాక్‌కు గురయ్యారు. అందులో రెండు అట్టముక్కలు పెట్టి ఉన్నాయి. తిరిగి యాప్‌లోకి వెళ్ళి చూడగా, రిటర్న్ ఆప్షన్ లేదు.. కంపెనీ వెబ్‌సైట్ ఓపెన్ కాని పరిస్థితి.

- కొత్తపేటలోని గణేశ్వరరావు వీధికి చెందిన డి.ప్రసాద్ అనే వ్యక్తి ఒక ప్రధాన యాప్ ద్వారా ఆఫర్ ఉండటంతో ఆరు సూట్‌కేసులు బుక్ చేశారు. అయితే అందులో ఉన్న కంపెనీకి బదులుగా మరో కంపెనీ సూట్‌కేసులు వచ్చాయి. దీనిపై కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం కనపడలేదు. ఆన్‌లైన్ వస్తువుల విక్రయాల్లోనూ జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ఈ-మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో యాడ్స్ రూపంలో ప్రకటనలు ఇస్తూ.. ప్రజలకు కొందరు టోకరా ఇస్తున్నారు. వీటితోపాటు వెబ్ లింక్‌ల ద్వారా సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయనే చెప్పాలి. చిన్నపాటి మొత్తాలు కావటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటం లేదు. అదే ఉద్యోగ మోసాలు, ఆన్‌లైన్‌లో సొమ్ములు పోయినవి అయితే అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. ఎస్ఎంఎస్ రూపంలో లింకులపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



బ్రాడీపేట యువతికి కొరియర్‌లో వచ్చిన అట్టముక్కలు

హలో అంటూ అందినకాడికి..

వేసవి నేపథ్యంలో మన ఇంట్లో ఉపయోగించే ఏసీ, ఫ్రిజ్, టీవీల వంటివి రిపేర్ అవుతుంటాయి. కస్టమర్ కేర్ నంబర్ కోసం నెట్‌లోకి వెళ్ళి వెతికే క్రమంలో అవే కంపెనీల పేరుతో ఫేక్‌కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. టెలీ కాలర్స్ మాట్లాడి మన వివరాలు తెలుసుకుని ఖాతాలు కొల్లగొట్టే ఆస్కారం ఉంది.


డేటా చోరీ

వాస్తవానికి పెద్దవిగా, గజిబిజి అక్షరాలతో ఉండే వెబ్‌లింక్‌లను షార్ట్ లింక్‌ల మాదిరిగా పంపే ఆప్షన్‌లు ఇప్పుడొచ్చేశాయి. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్ళు షార్ట్ లింక్‌లను సెల్‌ఫోన్‌లలోని యాప్‌లకు పంపుతూ.. వాటిని క్లిక్ చేసి తరువాత పర్సనల్ డేటాను హ్యాక్ చేస్తున్నారు. ఈ-మెయిల్ ద్వారా వచ్చే లింక్ క్లిక్ చేస్తే ఫేక్ వెబ్‌సైట్ ఓపెన్ అయి.. తెలియక మన వివరాలన్నీ ఎంటర్ చేస్తాం. హ్యాకర్లు ఈ లింక్లతో మన సిస్టమ్‌ను వారి కంట్రోల్‌లోకి తీసుకుని క్రిప్టో మైనింగ్ ద్వారా డబ్బులు దోచేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు అవసరం..

సెల్‌ఫోన్‌కు వచ్చే మేసేజ్‌లు, సామాజిక మాధ్యమాలకు వచ్చే లింక్‌లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. తెలియని లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. ఒకవేళ తెలియక క్లిక్ చేసినా డబ్బులు పంపించకూడదు. ఓటీపీ, నెట్ బ్యాంకింగ్, యూపీఐలను ఎట్టి పరిస్థితుల్లోనూ వేరే సైట్‌లో ఎంటర్ చేయకూడదు. తెలియని క్యూఆర్ కోడ్లు స్కాన్ చేయకూడదు, క్రెడిట్ కార్డులో నగదు పెంచేందుకు గడువు ఒక్కరోజే ఉంది, ఓటీపీ చెబితే వెంటనే అప్డేట్ చేస్తామని చెబుతారు.. బ్యాంకుల నుంచి అటువంటి ఫోన్‌కాల్స్ రావనే విషయాన్ని గుర్తించాలి. మీకు ఆన్‌లైన్‌లో కొన్న వస్తువుకు గిఫ్ట్ వచ్చింది, అడ్రస్ చెబితే ఇంటికి పంపిస్తామని ఫేక్ కాల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన క్రమంలో చిరునామా, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. సైబర్ నేరాలకు గురైన వారు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. లేదంటే https://www.cybercrime.gov.inకి ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరం జరిగిన గంటలోపు స్పందిస్తే.. బ్యాంకులు నగదు చోరీని నిలువరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112కు సమాచారాన్ని అందించాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నిత్యం సామాజిక మాధ్యమాల్లో జరిగే నేరాలను చూస్తూనే ఉన్నాం. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అనవసరమైన లింక్‌లు తెలియకుండా క్లిక్ చేస్తే.. ఇబ్బందులు తప్పవన్న విషయాన్ని గుర్తించాలి. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కి ఫిర్యాదు చేయాలి.

– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

- నలుగురికి తీవ్రగాయాలు
- నిలిచిన వాహనాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోడ్రైవర్ మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ వెళుతూ ఫిరంగిపురం గ్రామశివారులోని గోకుల్ టీసెంటర్ సమీపంలో గుంటూరు నుండి నరసరావుపేట వెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోడ్రైవర్ జి.మనోజ్‌కుమార్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలం నుంచి రహదారి కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న సీఐ రవీంద్రబాబు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటనా స్థలంలోని ఆటో వద్ద మృతుడు మనోజ్‌కుమార్, వాహనాలు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,500** గరిష్ఠం : రూ. **10,600**

మోడల్ ధర రూ. **9,000**

క్లుప్తంగా

ఐదు నుంచి టైలరింగ్ శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మే నెల 5వ తేదీ నుంచి ఉమెన్స్ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని, వయస్సు 19 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు, ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి గుంటూరు, గ్రామీణ నిరుద్యోగ యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు బుధవారం ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదిత్య కాంపిటీషన్స్ డైరెక్టర్ కె.ప్రణయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతోపాటు ఇతర అధ్యాపకులు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. సదస్సులో పాల్గొనే ప్రతి అభ్యర్థికీ సైకాలజీ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తామని, వివరాలకు 98490 03166, 91105 88864 సంప్రదించాలని సూచించారు.

17 వరకు డైట్ టెండర్ల స్వీకరణ

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కార్యాలయం పరిధిలో తెనాలి జిల్లా వైద్య పరిషత్‌లో రోగులు, విధుల్లో ఉన్న వైద్యులకు ఆహారం సరఫరా చేసేందుకు ఈనెల 17వ తేదీ వరకు టెండరు ఫారాలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బండారు వెంకట రంగారావు తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు టెండరు ఫారాలు స్వీకరిస్తామని, పూర్తి చేసిన టెండరు ఫారాలు 17వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు గుంటూరు పట్టాభిపురంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో టెండరు బాక్సులో వేయాలన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



పెదకాకాని సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: భారతదేశం గర్వించదగ్గ మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని పెదకాకానిలో సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం అన్ని కులాలు, మతాలతో ముందుకు వెళుతుందంటే భారత రాజ్యాంగం వలనే సాధ్యమవుతుందన్నారు. నిరంతరం ప్రజల అభ్యున్నతికి, సమాజ శ్రేయస్సు కోసం, అణగారిన వర్గాల కోసం పోరాడిన స్ఫూర్తిదాత డాక్టర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా నేటి యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోళ్ల శ్యాం ముఖర్జీబాబు, వుయ్యూరి సతీష్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, బండ్లమూడి చక్రి, భాను పలువురు నాయకులు పాల్గొన్నారు.



గుంటూరులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వై.నాగరాజా



ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ అరవింద్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: గొప్ప రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని పొందుపర్చడంతో పాటు మహిళలకు ఓటు హక్కు కల్పించారని అన్నారు. రాజ్యాంగం ద్వారా పౌరులందరికీ సమన్యాయం కల్పించేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ నాయకుడు కూచిపూడి మోహనరావు, జెడ్పీ అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో డాక్టర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి వై.నాగరాజా, ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వై.గోపాలకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమానికి గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగశెట్టి శివ సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. అంబేడ్కర్ ఆశయాలు, సాధించిన విజయాలు గురించి బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి వివరించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

నగరంపాలెం: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పశ్చిమ సబ్‌డివిజన్ డీఎస్పీ అరవింద్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహనీయుడు స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోదీ సర్కార్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

లక్ష్మీపురం: రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ దెబ్బతిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నుంచి అంబేడ్కర్ జయంతి వరకు దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళన ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకు రావడం కోసం ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తీసుకొచ్చారని చెప్పారు. నిరసనగా దేశవ్యాప్తంగా మైనారిటీలందరూ రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నా నరేంద్ర మోదీకి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. త్వరలో క్రైస్తవుల ఆస్తులు పైన కూడా చట్టాలు తీసుకురాబోతున్నారని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి లౌకిక వాదాలు, ప్రజాస్వామ్యవాదులు, కార్యకర్తలు, లౌకిక శక్తులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని చెప్పారు. అంబేడ్కర్ జయంతి స్ఫూర్తితో రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మరిన్ని పోరాటాలకు ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, షేక్ వలి, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చినాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారు యశ్వంత్ శశి, నగర కార్యదర్శి బన్ని, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, నగర కార్యదర్శి జి.లక్ష్మి పాల్గొన్నారు.

సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డికి ఘన నివాళి

- దశ దిన కర్మకు హాజరైన ప్రముఖులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ

గుంటూరు రూరల్: సోషలిస్ట్ పార్టీ నేత మోదుగుల పాపిరెడ్డి(88) దశదిన కర్మకు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. సోమవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని రెడ్డిపాలెం వద్ద ఉన్న ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసంలో పాపిరెడ్డి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మోదుగుల కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. పాపిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మర్రి రాజశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు, వైఎస్సార్ సీపీ పొన్నూరు, ప్రత్తిపాడు, వేమూరు, సత్తెనపల్లి, మంగళగిరి సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, వరికూటి అశోక్‌కుమార్, గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, దొంతిరెడ్డి వేమారెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబులతో పాటు భాష్యం రామకృష్ణ, నన్నపనేని రాజకుమారి, కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీలు జేడీ శీలం, వై.శివాజి తదితరులు హాజరై నివాళులర్పించారు.



పాపిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అన్ని వీఆర్వో సంఘాలతో ఐక్యకార్యాచరణకు సిద్ధం

- ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకుడు భూపతిరాజు రవీంద్ర రాజు
- గతంలో ఏపీజేఏసీ అమరావతి, వారి అనుబంధ వీఆర్వోల సంఘంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు అంగీకారం
- బహిరంగ క్షమాపణలు చెప్పిన రవీంద్రరాజు
- స్వాగతించిన ఏపీజేఏసీ అమరావతి అనుబంధ వీఆర్వోల సంఘం

గుంటూరు మెడికల్: ఏపీజేఏసీ, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంతో కలిసి పని చేస్తామని ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వోల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని ఏపీఎన్జీవోస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీంద్రరాజు వెల్లడించారు. గతంలో ఏపీజేఏసీ, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంపై అనుచిత వ్యాఖ్యలతోపాటు వారి కార్యకలాపాలకు ఆటంకం కలిగించామని, దీనికి బహిరంగంగా క్షమాపణలు తెలియజేస్తున్నానని తెలిపారు. తొలుత ఏపీజీఈఏ అనుబంధ వీఆర్వో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రవీంద్రరాజు ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ రావడంపై చర్చించేందుకు ఆ సంఘ నాయకులు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకులు అనుపమ, అయూబ్ తో పాటు ఏపీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ మరియు ఇతర గుంటూరు జిల్లా సంఘ నాయకులు, భూపతి రవీంద్ర రాజు వద్దకు వెళ్లి నిలదీశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. ప్రస్తుతం వీఆర్వోలపై పని భారం ఎక్కువగా ఉందని, ఇలాంటి విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని సూచించారు. లేదంటే ఈ సమావేశాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీంతో భూపతి రవీంద్ర రాజు ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘ నాయకులకు క్షమాపణలు చెప్పారు. ఇకపై ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘంతో కలిసి పని చేస్తామని ప్రకటించారు. దీనిపై త్వరలో ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని ఏపీజేఏసీ అమరావతి, ఏపీఆర్ఎస్ఏ అనుబంధ వీఆర్వోల సంఘం నాయకులు స్వాగతించారు. కార్యక్రమంలో ఏపీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, ఏపీవీఆర్వోల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ, ప్రచార కార్యదర్శి కోటేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్, కోశాధికారి నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శులు చిన్నారి, శ్రీలక్ష్మీ, గుంటూరు తూర్పు మండల అధ్యక్షులు అరుణ్, ఉపాధ్యక్షుడు రామ్ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సంగీతరావు, వంశీ, పొన్నూరు మండల కార్యవర్గ సభ్యులు బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో ఏడు కిలోలు వెండి మాయం

పెదకాకాని: ఇంటిలో ఉన్న వెండి, నగదు దోచుకెళ్లిన ఘటన సోమవారం వెలుగు చూసింది. పెదకాకాని మండలం వెనిగండ్లకు చెందిన దుంపగుంట్ల రామకృష్ణ కుటుంబం ఈనెల 10వ తేదీన హైదరాబాద్ వెళ్లారు. సోమవారం ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తలుపులు తీసి అందులో ఉన్న ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.50 వేల ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన విషయం పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.


కానిస్టేబుల్ అదృశ్యం



ఫరూఖ్ (ఫైల్)

మంగళగిరి టౌన్: కానిస్టేబుల్ అదృశ్యంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆక్టోపస్‌లో కానిస్టేబుల్‌గా ఫరూఖ్ విధులు నిర్వహిస్తున్నాడు. మంగళగిరి పట్టణ పరిధిలోని టిప్పర్ల బజార్‌లో గత కొంతకాలంగా కుటుంబంతో కలసి ఉంటున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు. వైజాగ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ ఉందంటూ ఫారుక్ ఈ నెల 8వ తేదీన వైజాగ్ బయలుదేరి వెళ్లాడు. ఆ మరుసటి రోజు సాయంత్రం 6 గంటల సమయంలో తన భర్తకు ఫోన్ చేసినట్లు ఆ సమయంలో వైజాగ్‌లోనే ఉన్నానని చెప్పినట్లు బషీరున్ ఫిర్యాదులో పేర్కొంది. 10వ తేదీ ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మళ్లీ రెండు రోజుల తరువాత ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్‌గా ఉండడంతో ఫరూఖ్ కుటుంబ సభ్యులు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు 12వ తేదీన మంగళగిరి చేరుకుని మంగళగిరి నగరంలోని ఆక్టోపస్ కార్యాలయానికి బషీరున్‌ను తీసుకుని వెళ్లారు. ఆక్టోపస్ కార్యాలయంలో అధికారులకు జరిగిన విషయం చెప్పడంతో ఫరూఖ్ ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు సెలవు పెట్టి ఉన్నాడని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనులకు విరాళం




భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకంతో పాటు పలు అభివృద్ధి పనులకు గుంటూరుకు చెందిన వై. మధుసూదనరావు విరాళం అందజేశారు. నిత్యాన్నదానానికి రూ. లక్ష, బంగారు గోపురం అభివృద్ధి పనుల నిమిత్తం మరో రూ. లక్ష, దేవస్థానంలో గో సంరక్షణ నిమిత్తం రూ.లక్ష, శివాలయం అభివృద్ధి పనులకు రూ.15,101 కలిపి మొత్తం రూ.3,15,101 విరాళంగా సోమవారం ఆలయ అధికారులను కలిసి అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి వేద పండితులతో ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. అనంతరం దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

తప్పిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని ఏల్చూరులో ఉన్న కస్తూరిబా గాంధీ గురుకుల బాలికా విద్యాలయాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి సోమవారం సందర్శించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థినులకు అంబేడ్కర్ చరిత్ర గురించి వివరించారు. ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధన చేయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. బాలల హక్కుల గురించి వివరించారు. పదో తరగతి పాసైన విద్యార్థినులకు కేజీబీవీలోనే ప్రవేశాలు కల్పించే విధంగా సమగ్ర శిక్ష, విద్యాశాఖను కోరినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



పట్నంబజారు: గుంటూరు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా డి.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నెల్లూరుతో పాటు పలు ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం వీఆర్‌లో నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా ఆయన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాత్రి బాధ్యతలు చేపట్టారు.

టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం యాప్‌లో వివరాలు ధ్రువీకరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలో అన్ని యాజమాన్యాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 హెచ్ఎంలతోపాటు అన్ని కేడర్లకు చెందిన ఉపాధ్యాయులు తమ సర్వీసు వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) ఫేషియల్ యాప్‌లో సరిచూసుకుని, ఓటీపీ ద్వారా తక్షణమే ధ్రువీకరించాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటీపీ వారి ధ్రువీకరించిన ఉపాధ్యాయుల సర్వీసు ప్రొఫైల్ వివరాల ఆధారంగానే భవిష్యత్తులో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించబడతాయని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువపత్రాలతో హెచ్ఎం, ఎంఈవో కార్యాలయాల ద్వారా ఆయా జిల్లాల విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో మంగళవారం సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలని సూచించారు.

అమర్‌నాథ్ యాత్రికులకు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు గుంటూరు జీజీహెచ్‌లో మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. యాత్రకు వెళ్లేవారు మెడికల్ సర్టిఫికెట్ నమూనా రెండు కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు, వయస్సు ధృవీకరణ పత్రాలకు సంబంధించి ఆధార్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. ప్రతి బుధవారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల మధ్యలో సర్టిఫికెట్ల కోసం రావాలన్నారు. యాత్రకు వెళ్లేవారి వయస్సు 13 నుంచి 75 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆరు వారాలు నిండిన గర్భిణులకు యాత్రకు అర్హత లేదన్నారు. యాత్రకు వెళ్లాల్సిన వారు మెడికల్ సర్టిఫికెట్ కోసం రూ.1500 జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో హెచ్‌డీఎస్ కౌంటర్‌లో చెల్లించాలన్నారు. ఈనెల 16 నుంచి సర్టిఫికెట్ల మంజూరు ప్రారంభమవుతుందన్నారు. ఇతర వివరాలకు 9963766638 నంబరులో సంప్రదించాలన్నారు.